తాగునీటికి అల్లాడుతున్న 'తుడిమిడి'

- ఉత్సవ విగ్రహాలుగా గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు
- బోరుబావుల నీటినే తాగుతున్న ప్రజలు

శాలిగౌరారం : ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీటిని అందించాలని ప్రభుత్వం భావిస్తుంటే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆరు సంవత్సరాలుగా గుక్కెడు తాగునీటికి నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు తుడిమిడి గ్రామ ప్రజలు. శాలిగౌరారం మండలంలోని తుడిమిడి గ్రామంలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా రూ.15.30 లక్షల వ్యయంతో 2017లో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నూతన ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మించింది. అదేవిధంగా గ్రామంలో మరో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా వాటిని కూడా మిషన్ భగీరథ కిందకు మార్చుచేశారు. కానీ నేటికి ఒక్క ట్యాంకులోకి నీరు చేరకపోవడంతో ప్రజలకు శుద్ధజలాలు అందడం లేదు.

సమన్వయ లోపంతో..

మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరా విషయంలో రెండు విభాగాలు ఉండగా అందులో ఒకటి గ్రిడ్, మరొకటి ఇంట్రా విభాగం. గ్రిడ్ విభాగానిది మెయిన్ పైపులైన్‌ల నుంచి ట్యాంకుల్లోకి నీటిని నింపే బాధ్యత. ఇంట్రా విభాగం ట్యాంకుల్లోని తాగునీటిని ఇంటింటికీ సరఫరా చేసే విధులు నిర్వర్తిస్తుంది. కానీ తుడిమిడి గ్రామంలో ఆరేళ్లుగా తాగు నీరు అందకపోవడానికి అధికారుల మధ్య సమన్వయ లోపమే ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు.



తుడిమిడి గ్రామంలో నిర్మించిన మిషన్ భగీరథ తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు

129 ఇళ్లకే పైపులైన్

తుడిమిడి గ్రామంలో మొత్తం 270 ఇళ్లు ఉన్నాయి. గ్రామ జనాభా 840 మంది. అందులో 129 ఇళ్లకు మాత్రమే మిషన్ భగీరథ పైపులైన్లు వేసి తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. మిగిలిన 141 ఇళ్లకు ప్రధాన పైపులైన్ వేయలేదు. పైపులైన్లు వేసిన ఇళ్లకు కూడా తాగు నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు గ్రామపంచాయతీ బోర్లతోపాటూ వ్యవసాయ బోరుబావుల వద్ద నీటినే తెచ్చుకుని తాగుతున్నారు. ప్రజల తాగు నీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ మిషన్ భగీరథ పైపులైన్‌కు గ్రామంలో మూడుచోట్ల పబ్లిక్ ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పైపులైన్‌లో నీటి సరఫరా జరిగినప్పుడే మాత్రమే ట్యాప్‌ల ద్వారా తాగునీరు అందుతుంది. పాలకులు ప్రత్యేక చర్యలు తీసుకుని తమకు తాగునీటిని సక్రమంగా అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బోరు మోటార్ల నీటినే తాగుతున్నాం



మా గ్రామానికి మొదటి నుంచి ఇంటింటికీ నాల్లా ద్వారా తాగునీరు రావడం లేదు. మిషన్‌భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామపంచాయతీ బోర్ల నీటినే తాగుతున్నాం. దీంతో కొంత అనారోగ్యానికి గురవుతున్నాం. మిషన్ భగీరథ తాగునీరు మాకు ఎప్పటికి వస్తాయో అని ఎదురు చూస్తున్నాం.

– బిక్కి కిష్టమ్మ, తుడిమిడి

అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం



గ్రామంలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నా ఒక్క ట్యాంకులోకి కూడా మిషన్ భగీరథ తాగునీరు చేరడంలేదు. ట్యాంకుల్లోకి నీటిని నింపాలని ఏళ్ల తరబడి అధికారులకు విన్నవిస్తూ వస్తున్నాం. కానీ నేటికి ఏ ట్యాంక్‌లోకి నీటిని నింపడంలేదు. అధికారుల పొరపాటు వల్లనే ప్రజలు తాగు నీటి సమస్య ఎదుర్కొంటున్నారు.

– చలకాని రజిత, సర్పంచ్, తుడిమిడి

టెక్నికల్ సమస్య ఏర్పడింది

తుడిమిడిలో మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులోకి నీరు వెళ్లడం లేదనేది వాస్తవం. పైపులైన్‌లో టెక్నికల్ సమస్య ఏర్పడింది. దానితో పాటూ మెయిన్‌లైన్‌కు గ్రామంలో మూడు పబ్లిక్ ట్యాప్‌లు పెట్టారు. ట్యాప్‌లు ఓపెన్ కావడంతో ట్యాంక్ లైన్‌కు నీటి ఒత్తిడి లేకపోవడంతో ట్యాంకులోకి నీరు ఎక్కడం లేదు. సమస్యను పరిష్కరించి ట్యాంకులోకి తాగునీటిని ఎక్కించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జాన్‌ప్రైడ్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ, శాలిగౌరారం మండలం

ఐటీ హబ్ నీలగిరికే తలమానికం

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ఐటీ హబ్ నీలగిరికే తలమానికం అని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఐటీ హబ్‌ను సందర్శించి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు స్థానికంగా ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఐటీ హబ్ లోపల, బయట పరిశీలించి పనులు త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా పానగల్ బైపాస్ రోడ్డు వద్ద డ్రైనేజీ పనులను పరిశీలించారు. బీట్ మార్కెట్‌లో నిర్మిస్తున్న సమీకృత ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించి మిగిలిన పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం 42వ వార్డులో రూ.15 లక్షలతో చేపట్టనున్న వరద కాల్వపై స్లాబ్ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కమిషనర్ కె.వి. రమణాచారి, కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, గోగుల శ్రీనివాస్, నాయకులు పబ్బు సందీప్, జె. వెంకట్‌రెడ్డి ఉన్నారు.

నలువైపులా నల్లగొండ పట్టణ అభివృద్ధి

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నల్లగొండ పట్టణాన్ని నలువైపులా అభివృద్ధి చేసి చూపించామని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా కంచర్ల భూపాల్‌రెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో గురువారం వివిధ మండలాలకు చెందిన నాయకులు, విద్యా సంస్థల యాజమాన్యాలు తరలివచ్చి కంచర్లకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లగొండను దత్తత తీసుకున్న కేసీఆర్ రూ.1200 కోట్లతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని, మరో 25 శాతం పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అనంతరం పట్టణంలోని 9వ వార్డు, జంగాల కాలనీ, నడ్డివారిగూడెం, 32 వార్డు నుంచి పలువురు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, సందినేని జనార్దన్‌రావు, వట్టిపల్లి శ్రీనివాస్, వజ్జే శ్రీనివాస్, రాంరెడ్డి, మల్లయ్య, అలుగుబెల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్ : అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి

వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోవాలని కోరుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు గురువారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జి. లింగయ్య, వై. శేఖర్‌రెడ్డి, పి. నాగయ్య, ఎం. శ్రీనివాస్, నాగరాజు, జనార్దన్, శివశరణ్, శంకర్, మురళి తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల మధ్య కంచర్ల జన్మదిన వేడుకలు

నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం పట్టణంలోని వీటీ కాలనీ క్యాంపు కార్యాలయంలో దివ్యాంగుల మధ్య జరుపుకున్నారు. అదేవిధంగా భూపాల్‌రెడ్డికి యాదాద్రి భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కందుల లక్ష్మయ్య, బోనగిరి దేవేందర్, జనార్దన్‌రావు, శ్రీనివాస్, రావుల శ్రీనివాస్‌రెడ్డి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నల్లగొండ : బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని సీఎం ప్రకటించడంతో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిని గురువారం ఎమ్మెల్యే కంచర్ల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డికి చైర్మన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు చేసిన కైలాష్ నేత

మునుగోడు : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్ ఇవ్వాలని కోరుతూ గురువారం గాంధీ భవన్‌లో టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట బొల్లం వెంకన్న, మేకల మల్లయ్య, ఆరేళ్ల సైదులు, కాటం వెంకన్న, రాజశేఖర్, నాగరాజు గౌడ్, నిఖిల్‌చారి తదితరులు ఉన్నారు.

26న క్రీడాకారుల ఎంపిక

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికను వెల్మకన్నె గ్రామంలో ఈ నెల 26 తేదీన నిర్వహిస్తున్నట్లు సెలక్షన్ కమిటీ కన్వీనర్ రవీందర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 17 సంవత్సరాల లోపు బాలబాలికలు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ పాఠశాలల, గురుకుల పాఠశాలల విద్యార్థులు పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7569490905 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు నరసింహారెడ్డి మృతి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఈదునూరు నరసింహారెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గురువారం చకిలం అనిల్‌కుమార్ మండల జేఏసీ నాయకులతో కలిసి నరసింహారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సునిల్‌కుమార్, కైలాసపతి, శిరసవాడ సైదులు, సంజీవరెడ్డి, సైదాచారి, పల్నాటి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ శోభ 35 ఏళ్ల వయస్సులోనే రెండు కిడ్నీలు పనిచేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. డయాలసిస్ చేయించుకోవడానికి వారానికి మూడు రోజులు నల్లగొండ పట్టణానికి వెళుతోంది. కనీస ఖర్చులు లేక దయనీయ పరిస్థితిలో ఉన్న ఆమెకు యడవల్లి యువజన సంఘం నాయకులు ఆన్‌లైన్ ద్వారా సేకరించిన రూ.9000 గురువారం అందించారు. అదే విధంగా గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు పర్సనబోయిన వెంకటేశ్ 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ముచ్చపోతుల నరేష్ గౌరవ అధ్యక్షుడు దోటి సైదులు, ప్రధాన కార్యదర్శి కోర్వి ధనరాజ్, కార్యదర్శి భోగరాజు స్వామి సభ్యులు జిల్లా శేఖర్, జంగాల రాజు, ఊరుగుండ్ల శివాజీ పాల్గొన్నారు.

పగిడిమర్రిలో..

కనగల్ మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన నీలకంఠం వెంకమ్మ ఇటీవల గుండెపోటుతో మరణించింది. ఆమె కుటుంబసభ్యులను ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు గురువారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సీత నాగరాజు, బుట్టి వెంకన్న, శ్రీను, మల్లేశం, చిన వెంకట్‌రెడ్డి, ఎల్లేశం, జానీ, సైదులు, బజారు, రవీందర్‌రెడ్డి, పవన్, ఇస్తారి, రమేష్ అశోక్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున శుక్రవారం పెద్దబండ, ఇండోర్ స్టేడియం, గొల్లగూడ, మహిళా ప్రాంగణం, బృందావన్ హోం, శబరి హోమ్స్, అలకాపురి, హైటెక్ కాలనీ, బీటీఎస్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని గురువారం సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మలిగిరెడ్డి రంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా కొల్లు నర్సయ్య, జిల్లా సంపత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొప్పుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా అంబటి ఏలేష్‌లను ఎన్నుకున్నారు.

పశు వైద్యశిబిరం

కనగల్ : మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. సకాలంలో ఎదకు రాని పశువులకు పశువైద్యాధికారి డాక్టర్ సీహెచ్ బాబు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా రైతులకు సలహాలు సూచనలను అందించారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ మల్లెపల్లి వెంకటమ్మ గోపాలమిత్రల సూపర్‌వైజర్ దామోర ప్రసాద్, గోపాలమిత్రలు యర్రోల్ల సురేష్, కర్నాటి జగత్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో చంద్రయాన్-3 విజయోత్సవం

రామగిరి(నల్లగొండ): జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, న్యాయవాదులు నారాయణ, ఆదిరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు అందజేత



స్కాలర్‌షిప్ పత్రాలు అందిస్తున్న దాసరి వెంకన్న

కనగల్ : మండలంలోని దోరెపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు గురువారం ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున 10 మందికి బయోస్టార్ట్ కంపెనీ స్కాలర్ షిప్‌లను అందజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప సర్పంచ్ దాసరి వెంకన్న హాజరై ఎంపిక చేసిన పది మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పెద్ది దామోదర్, సంస్థ సభ్యులు రంజిత్‌కుమార్, కృష్ణ, కిరణ్‌రావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని వరుణ దేవుడికి పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

కనగల్ : వర్షాలు కురవాలని కోరుకుంటూ వరుణ దేవుడికి గురువారం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయం, బొడ్రాయి వద్ద గ్రామ మహిళలు పూజలు నిర్వహించారు. వరద పాయసం చేసి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింగ్ సునితాకృష్ణయ్య గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల వితరణ



నకిరేకల్ : బియ్యం అందజేస్తున్న బీజీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచనదుర్గ ప్రసాద్ తల్లి దశదిన కర్మకు గురువారం క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బెజవాడ లక్ష్మీనారాయణ, కోటగిరి రాధాకృష్ణ, పుట్టరాజు, కొప్పు సందీప్, కొప్పు భరత్, ఎర్ర శరత్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నకిరేకల్ లయన్స్ క్లబ్, నవ్య లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల అధ్యక్షులు ఉప్పల వెంకటరమణ, కందాల శోభా శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ప్రతినిధులు రాంమోహన్‌రావు, లోకసాని అనిత, గోలి మంజుల, తక్కలపల్లి ప్రభాకరావు, సూర్యచంద్రరావు, రమాదేవి, బానాల సత్యవతి, అంజలి పాల్గొన్నారు.

సరుకులు అందజేత

చండూరు : లయన్స్ క్లబ్ ఆఫ్ చండూరు సేవ ఆధ్వర్యంలో గురువారం క్లబ్ కోశాధికారి లయన్ సంగు జానయ్య-స్వాతి పెళ్లిరోజు సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ మున్సిపల్ కేంద్రంలోని ఓ నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంజి యాదగిరి, మందడి శంకర్ రెడ్డి, పోలగోని రమేష్, కొత్త అంజిబాబు పాల్గొన్నారు.

మునుగోడులో నా గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

మునుగోడు : త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాను మునుగోడు నియోజకవర్గం నుంచి గెలవడం ఖాయమని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు రూ.4016లకు పెంచిన పెన్షన్ మంజూరు పత్రాలను గురువారం మునుగోడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని అర్హులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మునుగోడు స్థానం పొత్తులో భాగంగా సీపీఐకి ఇస్తారని, అలా ఇస్తే తాము పోటీచేసి గెలుస్తామని కొందరు కలలు కన్నారన్నారు. కానీ ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తననే ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం ప్రకటించారని అన్నారు. దీంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు తాము గెలవలేమని తేల్చుకుని పోటీలో నిలవాలా లేదా అనే ఆలోచనలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలకు సాగునీరు అందించేందుకు చర్లగూడెం వద్ద రిజర్వాయిర్ నిర్మిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు కోర్టులో కేసులు వేసి ఆ పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. 2023 ఎన్నికల అనంతరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయించి ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తానన్నారు. ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని, అందులో భాగంగా ఇప్పటివరకు నియోజకవర్గవ్యాప్తంగా రూ.వేయి కోట్ల నిధులు సీఎం కేసీఆర్ మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కర్నాటి స్వామి, పల్లె కళ్యాణి, మెండు మోహన్ రెడ్డి, జెడ్పీటీసీలు కర్నాటి వెంకటేశం, వీరమళ్ల భానుమతి, చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పెన్షన్ బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ నాయకులు

రానున్న ఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థిగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించిన అనంతరం మొదటిసారి మునుగోడుకు వచ్చిన ప్రభాకర్‌రెడ్డికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా చల్మెడ గ్రామం నుంచి మునుగోడు వరకు భారీ కారు ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

నాంపల్లి : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీ పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం మండలంలోని లింగోటం, వడ్డేపల్లి, చిట్టెంపాడు, నాంపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500 గ్యాస్ సిలిండర్, చౌక ధరల దుకాణాల్లో 9 రకాల నిత్యావసర వస్తువులు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. రైతులకు ఎకరానికి ఏడాదికి రైతు బంధు కింద రూ.15వేలు, కౌలు రైతులకు కూడా రూ.15 వేలు అందిస్తామని, రైతులకు రెండు లక్షల రూపాయలు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గఫార్, నిమ్మల వెంకట్‌రెడ్డి, పానగంటి వెంకటయ్య, ఎస్కె చాంద్‌పాష, యాదగిరి, నాంపల్లి సంజీవ, పుష్పాక అరుణ, యాదయ్య, జగన్, హనుమంతాచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా చైతన్య యాత్రలో పాల్గొన్న చలమల్ల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

కేతేపల్లి : గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కేతేపల్లి తహసీల్దారు ఎస్.మధుసూదన్‌రెడ్డి కోరారు. ఓటు హక్కు నమోదుపై కేతేపల్లి తహసీల్దారు కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. కొత్తగా ఓటుహక్కు నమోదు కోసం ఈ నెల 26,27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఐ రాజేశ్వరి, ఏఎస్ఓ సైదిరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



కేతేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కట్టంగూర్ : పద్దెనమిది సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పక ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ డి స్వప్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 40 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటు హక్కు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని ఓటు లేని వారు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ సుకన్య, ఆర్.కుమార్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయ విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ప్రారంభమైంది. ఈ నెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటిరోజు సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మృత్సంగ్రహణ, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూర్తి హోమం, ధ్వజారోహణ, జలాధివాసం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా అఖండ దీపస్థాపన, విష్వక్సేన పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నేలపట్ల రమేష్, ఈఓ కళాశిక కుషలయ్య, ఆలయ సిబ్బంది శేఖర్, గోదాదేవి, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

వైద్యశాల భవన నిర్మాణ పనుల పరిశీలన

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలో రూ.32 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల వైద్యశాల భవనం పనులను గురువారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరలో నూతన భవనంలో వైద్య సేవలు ప్రారంభించాలనే లక్ష్యంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుర్రం గణేష్, నాయకులు పెండెం సదానందం, పల్లె విజయ్, మంగినపల్లి రాజు, రాచకొండ వెంకన్నగౌడ్, జాఫర్, యానాల లింగారెడ్డి తదితరులు ఉన్నారు.



నకిరేకల్ : ఆస్పత్రి భవనం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన గాదగోని శంకరయ్య (60) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. శంకరయ్య మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన మల్లారం గ్రామానికి చెందిన అబ్బగోని కృష్ణయ్య, బొల్లేపల్లికి చెందిన పుట్టు ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఇరు కుటుంబాలకు రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, పెద్ది బాల నర్సింహాగౌడ్ ఉన్నారు.

త్వరలో చాడ కిషన్‌రెడ్డి భవిష్యత్ కార్యాచరణ !

నల్లగొండ టూటౌన్ : బీఆర్ఎస్ పార్టీ తరపున నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం రాకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి త్వరలో కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. 2001లో కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీ బలోపేతానికి పనిచేసినట్లు సన్నిహితుల వద్ద ఆవేదన చెందినట్లు తెలిసింది. 2009లో పొత్తులో భాగంగా అవకాశం దక్కలేదని, 2014లో అవకాశం కల్పించకపోయినా కేసీఆర్ ఆదేశాల ప్రకారం పని చేశానని, 2018లో ఇతర పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇస్తే సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి నిర్ణయం మేరకు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసినా చివరికి నిరాశే మిగిలినట్లు చెబుతున్నారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై ముఖ్య నాయకులతో కలిసి వారి అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని చాడ కిషన్‌రెడ్డి తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

బస్‌షెల్టర్ల నిర్మాణానికి ఎంపీ కోమటిరెడ్డి హామీ

సాక్షి ఎఫెక్ట్..

కనగల్ : మండల పరిధిలోని జి చెన్నారం, దోరెపల్లి క్రాస్‌రోడ్ల వద్ద బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతుండడంపై గురువారం సాక్షి దినపత్రికలో బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు అనే కథనం ప్రచురితమైంది. దీంతో సాక్షి కథనానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. జి చెన్నారం, దోరెపల్లి క్రాస్‌రోడ్ల వద్ద ఒక్కో బస్‌షెల్టర్‌ను రూ.5లక్షల చొప్పున నిధులతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు ముందుకు వచ్చారు. బస్‌షెల్టర్ల నిర్మాణానికి అడ్డంకులు ఉంటే తొలగించి నిర్మాణ ఏర్పాట్లను వెంటనే చేయాలని మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్‌కు, స్థానిక కాంగ్రెస్ నాయకులకు సూచించారు. బస్‌షెల్టర్లు నిర్మించేందుకు ముందుకు వచ్చిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల భద్రతకే షీటీం



మాట్లాడుతున్న సీఐ గోపి

నల్లగొండ క్రైం : మహిళల భద్రత కోసమే ప్రభుత్వం షీ టీం ఏర్పాటు చేసిందని షీటీం ఇన్‌చార్జ్ సీఐ రౌతు గోపి అన్నారు. గురువారం సాగర్ రోడ్డులోని డాన్‌బోస్కో స్కూల్‌లో మహిళల భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళలను వేధిస్తే షీటీం పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసరమైతే 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాల్లో డబ్బులు పోగొట్టుకుంటే టోల్ ఫ్రీ నంబర్ 1930 ఫోన్ చేసి వివరాలు చెప్పాలన్నారు. విజయలక్ష్మి, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాల వేడుకలు



కట్టంగూర్‌లో బోనాలను ఎత్తుకెళ్తున్న మహిళలు

కట్టంగూర్ : ముత్యాలమ్మ, మారమ్మ, మైసమ్మ పండుగను గురువారం కట్టంగూర్ గ్రామ ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనాలను ఎత్తుకెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేడుకల్లో పాల్గొని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, పోగుల నర్సింహ, పెద్దగౌడ్ కొంపెల్లి యాదయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు రాజకీయ వాటా దక్కేవరకూ పోరాటం

నార్కట్‌పల్లి : జనాభా దామాషా ప్రకారం ఆర్యవైశ్యులకు రాజకీయ వాటా దక్కేవరకూ సమష్టి పోరాటానికి సిద్ధం కావాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ పిలుపునిచ్చారు. అక్టోబర్ 1న హైదరాబాదులో నిర్వహించే వైశ్య గర్జన బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను గురువారం సంఘం నాయకులతో కలిసి నార్కట్‌పల్లిలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ, కోటగిరి దైవాదీనం, కొత్త రవి, బుక్కా ఈశ్వరయ్య, పాల్వాయి భాస్కర్‌రావు, శ్రీనివాస్, నారాయణ, రమాదేవి, విష్ణు, కోటయ్య, సోమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.